




మాట్లాడుతున్న ఎస్పి విక్రాంత్ పాటిల్

సామాన్య రైతుకు అందేనా..?



సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించనున్న ప్రభుత్వం

అప్పుడే మొదలైన అధికార పార్టీ నేతల సిఫార్సులు

రైతులకు వ్యవసాయ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం పలురకాల యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన అందించాలని గతంలో వైసిపి ప్రభుత్వం నిర్ణయించినా, అది ఆచరణకు నోచుకోలేదు. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పరికరాలను అందించాలని నిర్ణయించింది. రైతులకు ఎటువంటి పరికరాలు అవసరమో వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి, ప్రభుత్వానికి ఐదు నెలల కిందటే నివేదిక పంపారు. ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రైతులకు వాటిని అందించేందుకు అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పంటల సాగు సందర్భంలో రైతులు ట్రాక్టర్లు, రోటోవేటర్లు, దుక్కు, దమ్ము, నాట్లు, కలుపు తీసే యంత్రాలను కొందరు చేతి డబ్బులు పెట్టుకుని కొనుక్కోవాల్సి వస్తోంది. మరికొందరు అద్దెకు తీసుకుని వినియోగిస్తున్నారు. రైతులపై భారం తగ్గించడంతో పాటు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతులకు యంత్ర పరికరాలను ప్రభుత్వాలు అందిస్తూ వస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం రాయితీపై కాకుండా అద్దె ప్రాతిపదికన రైతులకు యంత్ర పరికరాలను అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం రైతు సేవా కేంద్రాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సిహెచ్‌సి)ను ఏర్పాటు చేసి రూ.15 లక్షల వరకు విలువ చేసే యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. రైతు సంఘాలనూ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియనూ పూర్తి చేశారు. రైతులకు మాత్రం పరికరాలను అందించలేదు. కర్నూలు జిల్లాలో 1660 యూనిట్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి కోసం రూ.2.86 కోట్లను కేటాయించారు. నంద్యాల జిల్లాలో 1635 యూనిట్లు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి కోసం రూ.2.84 కోట్లను కేటాయించారు. మండలాల వారీగా లక్ష్యాలను రూపొందించి అర్హులైన రైతులను ఎంపిక చేయనున్నారు. బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, ట్రాక్టర్‌తో నడిచే యంత్రాలను అందించనున్నారు. వీటితోపాటు పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్ ఇవ్వనున్నారు. రైతులు తమకు కావాల్సిన పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యంత్ర పరికరాల పంపిణీ కోసం ప్రభుత్వం జిల్లాలో ఇప్పటికే డీలర్లను ఎంపిక చేసింది. రైతు తనకు నచ్చిన ఏజెన్సీ నుంచి పరికరాలను పొందే వెసులుబాటు కల్పించింది. పరికరం రకాన్ని బట్టి 40 నుంచి 50 శాతం సబ్సిడీ చెల్లించనుంది. సబ్సిడీయేతర మొత్తాన్ని సంబంధిత డీలర్లకు చెల్లించి పరికరాలను తీసుకోవాల్సి ఉంటుంది.

అప్పుడే మొదలైన సిఫార్సులు

ప్రభుత్వం సబ్సిడీపై అందించనున్న యంత్ర పరికరాలపై రైతుల్లో చాలా డిమాండ్ నెలకొంది. ఎంపిక కోసం ప్రభుత్వం కొన్ని మార్గ దర్శకాలను సూచించింది. రైతు గత ఐదేళ్లలో యంత్ర పరికరాలను తీసుకొని ఉండకూడదని షరతు విధించింది. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇవ్వనున్నట్లు పేర్కొంది. నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తే సామాన్య రైతులకు సైతం మేలు చేకూరుతుంది. 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రాజకీయ సిఫార్సులున్న వారికే కట్టబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. టిడిపి నేతల ఇళ్లలో పరికరాలు దర్శనం ఇచ్చిన ఘటనలు వెలుగు చూశాయి. ఇప్పుడూ అదే కథ పునరావతం అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో నేర నియంత్రణ

- జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను పట్టుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నేర సమీక్షా సమావేశంలో వర్చువల్ విధానంలో పాల్గొన్న సిఐడి ఐజి వీనిత్ బ్రిజ్ లాల్‌తో జిల్లా ఎస్పీ మాట్లాడారు. అనంతరం కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న కేసుల గురించి జిల్లా ఎస్పీ సమీక్షించి ఆరా తీశారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పలు సలహాలు, సూచనలు చేశారు. ఎస్‌పి మాట్లా డుతూ కేసు నమోదు నుంచి అభియోగ పత్రాలు దాఖలు వరకు ప్రతి అంశాన్నీ సీసీటీ ఎన్ఎస్ అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని వివరాలు నమోదు చేయడం వల్ల కేసులు, వ్యక్తుల పూర్తి సమాచారం తెలుస్తుందని, అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందన్నారు. సీసీటీఎన్ఎస్‌లో ముఖ్యంగా గ్రేవ్ కేసులు, నాన్ గ్రేవ్ కేసులలో పార్ట్ 1, పార్ట్ 2 సీడీలు అప్డేట్‌గా ఉండేలా చూసుకోవాలన్నారు. మర్డర్ కేసుల్లో, 174 సిఆర్‌పిసి కేసుల్లో త్వరితగతిన పురోగతి పొందేలా చూసుకుంటూ అభియోగ పత్రాలను వీలైనంత తొందరగా కోర్టులో ధాఖలు చేయా లన్నారు. డిఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తు చేస్తున్నపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రైమ్ రికార్డు సిడి ఫైల్స్ తయారు చేయడంలో, సిసిటిఎన్ఎస్‌లో వివరాలు నమోదు అప్ డేట్ చేయడంలో ఎలాంటి లోపాలు ఉన్నాయో తెలియ జేశారు. ఎమి చేయాలి, ఎమి చేయకూడదనే విష యాలను తెలియజేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లలో పని చేసే సిసిటిఎన్ఎస్ పోలీసు సిబ్బందితో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవా లన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ ఆయా పోలీసుస్టేషన్ల పరిధులలో తనిఖీలు నిర్వహించా లన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుస్సేన్ పీరా, ఏర్ అడిషనల్ ఎస్పీ కృష్ణ మోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసాచారి, ఉపేంద్ర బాబు, హేమలత, భాస్కర్ రావు, ట్రైనీ డిఎస్‌పి ఉష శ్రీ, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

22న డిప్యూటీ సిఎం పర్యటన ఖరారు

- పూడిచెర్లలో ఫారం పండ్ పనులకు శంకుస్థాపన

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఈనెల 22న ఓర్వకల్లు మండలంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన ఖరారు అయింది. డిప్యూటీ సిఎం పూడిచర్ల గ్రామం సమీపంలో ఫారం ఫండ్ పనులకు శంకుస్థాపన చేసి అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించ నున్నారు. డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, భద్రత గురించి ఎస్పీతో చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 4 వేల మంది వరకు బహిరంగ సభకు హాజరవుతారని తెలిపారు. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. స్టేజ్ అరేంజ్మెంట్స్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లకు సంబంధించి ఆర్ అండ్ బి ఎస్ఈకి పలు సూచనలు ఇచ్చారు. వేదికపై చేయాల్సిన ఏర్పాట్లను చూసుకోవాలని జడ్పీ సీఈవోకు సూచించారు. పారిశుధ్య చర్యలు, శిలాఫలకం ఏర్పాటు, బ్యాక్ డ్రాప్, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, సౌండ్ సిస్టమ్, ఎల్ఈడిలు తదితర ఏర్పాట్లపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్‌ను కలెక్టర్ సందర్శించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పి సిఇఒ నాసర రెడ్డి, పిఆర్ ఎస్ఇ రామచంద్రారెడ్డి, ఆర్ అండ్ బిఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు, ట్రాన్స్ కో ఎస్ఇ ఉమాపతి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ శాంత కుమారి, ఆర్‌టిసి ఆర్ఎం శ్రీనివాసులు, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డ్వామా పిడి వెంకట రమణయ్య, మెప్మా పీడీ నాగ శివ లీల, డిఐపిఆర్‌ఓ జయమ్మ, కర్నూలు డిఎస్‌పి బాబు, ప్రసాద్, డిఎం సివిల్ సప్లైస్ నాగ సుధ, డిఎస్ఒ రాజా రఘువీర్, డిప్యూటీ డిఎంహెచ్ఒ భాస్కర్, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ అవినాష్ జయసింహ, డిపిఒ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మద్దన్న, సురేష్, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

సమస్యలను పట్టించుకునే నాథుడే లేడు..

- కాల్వలను నెలకోసారి కూడా శుభ్రం చేయడం లేదు

- దోమల దాడితో రోగాల బారిన పడుతున్నాం - సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో గూడూరు ప్రజల ఆవేదన



గూడూరు : పూడిపోయిన కాల్వను నాయకులకు చూపుతున్న స్థానికులు

ప్రజాశక్తి - గూడూరు

గూడూరు పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమంలో స్థానిక ప్రజలు నాయకుల ఎదుట ఏకరువు పెట్టారు. ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని, పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గూడూరు పట్టణంలోని గొల్లవీధి, కురుకుంద వీధి, మూలగేరిలలో ప్రజాచైతన్యయాత్రలో భాగంగా సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. నాయకులు స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయడం లేదు. మురికి కాలువలు కంపు కొడుతున్నాయి. డ్రెయినేజీ కాలువలను నెలకొకసారైనా శుభ్రం చేయడం లేదు. కురుకుంద వీధిలోని డాక్టర్ నాగరాజు హాస్పిటల్ పక్కన గల డ్రైనేజీ కాలువ బ్లాక్ కావడంతో మురికి నీరు చెత్తాచెదారంతో పేరుకుపోయింది. ఈ కాలువ రోడ్డు పక్కనే ఉండడంతో కంపు కొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి దాడి చేస్తున్నాయి. దోమల దాడితో రాత్రిళ్ళు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోగాల బారిన పడుతున్నాం' అని స్థానిక ప్రజలు సిపిఎం నాయకులకు సమస్యలను వివరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ, గూడూరు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జె.మోహన్‌లు మాట్లాడుతూ ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధులలో ఉన్న డ్రైనేజీ కాలువలను వెంటనే శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి ప్రజలను దుర్వాసన, దోమల బారి నుండి రక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ వీధుల్లో ఉన్న ప్రజలను కలుపుకొని మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యుడు కె.రాజశేఖర్, సభ్యులు ధనమన్న, మధు, కృప, సుంకన్న,గోపి, అబ్రహం, సురేష్, గజ్జలన్న, జైలు, చిన్న తదితరులు పాల్గొన్నారు

ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన నగర పాలకమండలి : సిపిఎం

కర్నూలు కార్పొరేషన్ : నిరంతరం ప్రజా సమస్యలే పరిష్కారం ధ్యేయంగా పని చేయాల్సిన నగరక పాలక మండలి సమస్యలను గాలికి వదిలేసిందని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి.అబ్దుల్ దేశాయ్, కె.రామకృష్ణ, ఎస్ఎండి షరీఫ్‌లు విమర్శించారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కర్నూలు నగరంలోని 9, 10, 11 వార్డులలో ఖాజా పాషా అధ్యక్షతన నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల అజెండా మీద నగరపాలక మండలి కౌన్సిల్ జరగాల్సిన చోట మేయర్ ఎవరు కావాలనే రాజకీయ డ్రామా కర్నూలు కార్పొరేషన్‌లో జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి నువ్వా, నేనా మేయర్ అనే తగాదాలో కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు ఉన్నారని విమర్శించారు. కనీసం తాగునీరు, చెత్తాచెదారం, కాలువలు శుభ్రంపై అధికారులు, ప్రజాప్రతినిధులు, పాలక మండలి ఏ మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న చేపట్టే మున్సిపల్ కార్పొరేషన్ ముట్టడిలో పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పాలకమండలిపై, ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు జయమ్మ, మూస మియా, చాంద్ బాషా, ఖాజా పాషా, వేణు, దామోదర్, పర్మేశ్, మాధవ్ అబ్దుల్లా, మహబూబ్ బాషా, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు నగరంలో మాట్లాడుతున్న నాయకులు

జర్నలిజం లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకం

- ఉచిత వైద్య శిబిరంలో సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్




వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర శర్మ

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కొనసాగుతుందంటే అది కేవలం జర్నలిజం వల్లేనని, జర్నలిజం లేకపోతే ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారు తుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ తెలిపారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో ఉన్న రెవెన్యూ భవన్‌లో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన వీడియో జర్నలిస్ట్ చిన్న స్మారకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బిపి, ఈసిజి, టుడి ఎకో లాంటి విలువైన పరీక్షలు ఉచితంగా ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. ప్రతి జర్నలిస్టు విధి నిర్వహణతో పాటు వ్యక్తిగతంగా తమ కుటుంబం, సమాజం కోసం ఆరోగ్యంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు రామస్వామి పాల్గొన్నారు.

వయస్సుకు తగ్గట్లు మాట్లాడకపోతే స్పీచ్ థెరపీ అవసరం

- ప్రముఖ ఆడియాలజిస్ట్ రోజా బంగి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



పిల్లలు వయస్సుకు తగ్గట్లు మాట్లాడ లేకపోతే, మాటలు స్పష్టంగా లేకపోతే, నత్తిగా మాట్లాడుతుంటే స్పీచ్ థెరపీ అవసరమని రోజాస్ హియరింగ్ స్పీచ్ అండ్ మల్టీ రిహాబ్ సెంటర్ ప్రముఖ ఆడియాలజిస్ట్ రోజా బంగి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. పిల్లలు పెద్ద పెద్ద శబ్దాలకు కూడా స్పందించలేకపోతే, నవజాత శిశువు శబ్దాలకు స్పందించడం లేకపోతే వారికి నవజాత వినికిడి స్క్రీనింగ్ అవసరమని అన్నారు. పుట్టినప్పటి నుంచి మూడు సంవత్సరాల మధ్య వినికిడి లోపం ఉన్నట్లయితే దీన్ని ముందుగానే గుర్తించి వినికిడి లోపాలను ప్రారంభ చికిత్స ద్వారా సరిదిద్దుకోవచ్చని తెలిపారు. పెద్దవారిలో వినికిడి సమస్యలు ఉన్న బ్రెయిన్ స్ట్రోక్ వల్ల మాటలు సరిగ్గా రాకపోయినా మరియు పెద్దవారి మాటలు అర్థం చేసుకోవడానికి కష్టంగా ఉన్నా, అబ్బాయిలు అమ్మాయి గొంతుతో, అమ్మాయిలు అబ్బాయి గొంతుతో మాట్లాడుతున్న మావద్ద అధునాతనమైన పరికరాలతో పరీక్షలు మరియు అధునాతనమైన పద్ధతిలో థెరపి ఇవ్వబడును అని వినికిడి సమస్యకు అధునాతనమైన వినికిడి యంత్రాలు తమ దగ్గర లభిస్తాయని తెలిపారు. వినికిడి సమస్యతో బాధపడేవారు ఇయర్ రింగ్ ఎయిడ్ (చెవి మిషన్) బయట కూడా దొరుకుతాయని కానీ ఆడియాలజిస్టు దగ్గరికి వెళ్తే ఎంత శాతం లోపముందో గుర్తించి దానికి తగ్గట్లు అమరచడం జరుగుతుందని అన్నారు. గత ఏడు సంవత్సరాలుగా ఎంతోమందికి సర్వీస్ ఇచ్చామని అన్నారు. మావద్ద స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, ఆడియోమెటరీ, ఆడిటరీ వెర్బల్ థెరపీ, అడ్వాన్స్ టెక్నాలజీ హియరింగ్ ఎయిడ్, న్యూ బోర్న్ ఇయర్ రింగ్ స్క్రీనింగ్, టైంపానోమెటరీ, ఓఏఈ, వేంప్, ఆక్యుపేషన్ థెరపీ, కోచ్ లియర్ ఇంప్లాంట్స్, బిహేవియర్ థెరపీ లభిస్తాయని అన్నారు. మరిన్ని వివరాలకు శకుంతల కళామందిర్ దగ్గర, మాస్టర్ జూనియర్ కాలేజ్ ఎదురుగా ఉన్న రోజా హియరింగ్ స్పీచ్ అండ్ మల్టీ రిహాబ్ సెంటర్‌ను సంప్రదించగలరని తెలిపారు.

తాగునీటికి కటకట..!

- ఐదు రోజులకోసారి సరఫరా

- డివిజన్ కేంద్రంలోనే నీటి కోసం అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంలోనే ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజలకు తాగునీటికి కటకట తప్పడం లేదు.

ఎండ తీవ్రతతో ప్రజలు తాగునీరు కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు పత్తికొండ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో నెలకొంది. పట్టణంలోని 9, 10, 11, 12, 13, 14వ వార్డుల్లో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. సుమారు 10వేల మంది తాగునీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. మార్చి మాసంలోనే ఐదు రోజులకోసారి నీరు సరఫరా చేస్తే రాబోయే ఏప్రిల్, మే మాసాలను తలచుకుంటేనే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు ఎప్పుడొస్తాయో, ఎప్పుడు బంద్ అవుతాయో తెలియని పరిస్థితి ఉందని, నిద్రాహారాలు మాని, పనులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా అధికారులు ప్రజలకు తాగునీరు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని వామపక్ష పార్టీలు నాయకులు మండిపడుతున్నారు. రాబోయే రోజులను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారులు కనీసం రోజు మార్చి రోజు నీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నీటికోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

దాహం తీర్చండి మహాప్రభో : నరసన్న, 14 వార్డు



మార్చి మాసంలో ఐదు రోజులకు ఒక్కసారి నీరు సరఫరా చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఏప్రిల్, మే మాసాలలో 10 రోజులకు ఒకసారి నీరు సరఫరా చేసే పరిస్థితి ఉంది. రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేయాలని అధికారులను వేడుకుంటున్నాం.

ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేశాం

- విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ



తాగునీటి కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురకుండా చర్యలు చేపడుతున్నాం. మండలంలోని తాగునీటి తీవ్రత ఉన్న గ్రామాలుగా అటికలి గుండు, నలకదొడ్డి, చక్రాల, చందోలి గ్రామాలను గుర్తించాం. మా దృష్టికి తీసుకువస్తే అవసరమైతే కొత్త బోర్ వేసి నీరు సరఫరా చేస్తాం.

మూడు రోజులు ఒక సారి నీటి సరఫరా

- నరసింహులు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్



పట్టణంలో 14వ వార్డు ఎస్సీ కాలనీలో నీటి తీవ్రత ఎక్కువగా ఉందని మా దృష్టికి వచ్చింది. వాటర్ మెన్‌ను ఎప్పటికప్పుడు అప్రమత్త చేస్తూ నీటిని సకాలంలో సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. పలానా టైంలో నీరు సరఫరా అవుతుందని ఎమ్మెల్యే, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, వాటర్ మెన్‌ల వాయిస్ మెసేజ్‌తో కాలనీ వాసులకు మెసేజ్ పంపిస్తున్నాం. ఇబ్బందులు తలెత్తుకున్న సకాలంలో నీరు సరఫరా చేస్తాం.

ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తాం

- గోపాల్, సిపిఎం మండల కమిటీ సభ్యుడు.

పట్టణంలోని వార్డుల్లో సుమారు సక్రమంగా నీరు అందడం లేదు. ఆర్డీవో, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. సమస్యను తీవ్రత కాకముందే పరిష్కరించాలి. లేనిపక్షంలో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

ముగిసిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ప్రజాశక్తి - తుగ్గలి

ఉపాధి హామీ చట్టం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం ముగిసింది. అడిషనల్ పీడీ మాధవి లత ఆధ్వర్యంలో మండలంలోని 23 పంచాయతీలకు సంబంధించిన ఉపాధి హామీ పనుల ఆడిట్ కొనసాగింది. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు చేపట్టిన పనులు, వాటి బిల్లుల వివరాలు తదితర అంశాలపై అధికారులు ఆరా తీశారు. ఉపాధి హామీ ఏపీవో హేమ సుందర్, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్‌లో 23 పంచాయతీలకు చెందిన వివరాలు జిల్లా అధికారులు నమోదు చేశారు. తుగ్గలి మండలంలో 23 పంచాయతీలు కలిపి రికవరీ రూ.4,10,189, జరిమానా రూ.3,51,500 విధించినట్లు ఏపీవో హేమసుందర్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలిలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ పవన్, ఎపిఎం రాధాకృష్ణ మాట్లాడారు. రసాయన ఎరువులు, పురుగుమందు వాడకం వల్ల నష్టాలు కలుగుతాయని తెలిపారు. మానవజాతికి హాని కలుగుతుందని చెప్పారు. భూమి కూడా నిర్జీవమైపోతుందని, పేదరికం నుంచి బయట పడాలంటే ప్రకృతి వ్యవసాయం ఏకైక మార్గమని తెలిపారు. ఎపిసిఎన్ఎఫ్ లింగప్ప, వెలుగు సిబ్బంది ఆంజనేయులు, కర్రన్న, ఓబులేసు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల డబ్బులు చెల్లించి పవన్ కల్యాణ్ జిల్లాకు రావాలి

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-గూడూరు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. 10 వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలు చెల్లించి జిల్లాకు రావాలని వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ డిమాండ్ చేశారు. గురువారం నారాయణ, సిఐటియు మండల కార్యదర్శి జె.మోహన్ మండలంలో ఉపాధి పనుల దగ్గరకు వెళ్లి ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుని వారితో మాట్లాడారు. జిల్లాలో 10 వారాలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు దాదాపు రూ.22 కోట్లు బకాయిలు రావాల్సి ఉందని, రెక్క ఆడితే గాని డొక్కాడని పేదలకు 10 వారాలుగా వేతనాలు రాకపోతే ఏం తిని బ్రతకాలని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న, ప్రశ్నించడం కోసమే జనసేన పార్టీ ఉందని రొమ్ములు గుద్దుకొని చెప్పే పవన్ కళ్యాణ్‌కు, ఆయన పనిచేస్తున్న శాఖలో కూలి పని చేసిన కూలీలకు డబ్బులు చెల్లించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నాడంటే ఆయన ఎలాంటివాడు అర్థమవుతుందని చెప్పారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కూలీలకు వేతనాలు చెల్లించకపోతే ఈ నెల చివరలో ఉగాది, రంజాన్, ఈస్టర్ పండగలు చేసుకునే పేదలు ఏం తిని వాళ్ళ కుటుంబాలతో గడవాలని వారు అన్నారు. ఫారం ఫండ్ పనులు భూమి పూజ చేసి ప్రారంభించడానికి వస్తున్నానని ఆయన హంగామ చేస్తున్నారని, ఆయన వచ్చిపోయే ప్రయాణపు ఖర్చులు ఖర్చు చేసిన జిల్లాలో సగం మందికి వేతనం ఇవ్వచ్చని తెలిపారు. ఆయన విలాసాల ప్రయాణాలకు ఖర్చు పెట్టే డబ్బులు పేదలకు చెల్లిస్తే వాళ్ళ డొక్కలు నిండుతాయని వారన్నారు. పవన్ కళ్యాణ్ ఆ శాఖకు అర్హులా కాదా నిరూపించుకోవాలని, నిజంగా అర్హులయితే జిల్లా పర్యటనకు వచ్చేలోగా పేదల ఖాతాలో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పేదల ఆకలి బాధలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

21న కవిత్వంతో కాసేపు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా ఈనెల 21న సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'కవిత్వంతో కాసేపు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్ గురువారం తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి టిజివి కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన 10 మంది కవులు తమ కవిత్వ అంతరంగాన్ని వివరించనున్నారని తెలిపారు. ఇందులో కల్యాణదుర్గం స్వర్ణలత, పులిచేరి మహేష్ కుమార్, నాగాంజనేయులు, సయ్యద్ జహీర్ అహ్మద్, తనగల విజయులు, పార్వతయ్య, ఇనాయతుల్లా, గౌరెడ్డి హరిచంద్రారెడ్డి, స్వరూప్ సిన్హాలు పాల్గొననున్నారని చెప్పారు. సభాధ్యక్షులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర జంధ్యాల రఘుబాబు, సభలో సందేశాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ ఇవ్వనున్నారన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం

- ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఫ్లోరోసిస్‌పై అవగాహన పెంచుకోవాలని ఫ్లోరోసిస్ జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఫ్లోరోసిస్ వల్ల కలిగే సమస్యలపై చిన్నటేకూరు గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాధరణంగా ఒక లీటర్ నీటికి ఫ్లోరైడ్ 1.5 పిపిఎం (పార్ట్స్ పెర్ మిలియన్) కన్నా ఎక్కువ ఉండకూడదని తెలిపారు. ఫ్లోరోసిస్‌కు గురైన వారికి ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు, గోధుమ రంగులోకి మారడం, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఎముకలు బోలుగా మారిపోవడం, వంగిపోయి కీళ్ల నొప్పి రావడం, కండరాల బలహీనత పడడం, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతాయని తెలిపారు. బీడీ, చుట్ట, పాన్, పాన్ మసాలా వంటివి ఉపయోగించడం వల్ల ఫ్లోరోసిస్ సంబంధిత ఆరోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. పిప్పిపళ్లు కారణంగా సరైన పోషకాహారం తీసుకోలేరని, దాని వల్ల పోషక లేమీకి గురై అనేక రకాల వ్యాధులకు గురవుతారని తెలిపారు. క్యాల్షియం, విటమిన్-సి ఉన్న ఆహారం, పాలు, గుడ్లు, రాగిజావ, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. సామాజిక ఆరోగ్య అధికారి బిందు, వెంకటేశ్వరమ్మ, ఆశా కార్యకర్త, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న డాక్టర్ సుధాకర్

దళారులను నమ్మవద్దు

- హౌసింగ్ డిఇ ఆదినారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి



నంచర్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఇంటి పట్టాలను, పొజిషన్ పట్టాలను చేయించి ఇల్లు నిర్మించుకోవడానికి కూడా అవకాశం కల్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దని హౌసింగ్ డిఇ ఆదినారాయణ తెలిపారు. గురువారం హౌసింగ్ ఎఇ భవ్య ఆధ్వర్యంలో నంచర్ల, కుందనగుర్తి గ్రామాల్లో అర్హత ఉన్న లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇల్లు నిర్మించుకోవడానికి అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడూ సచివాలయానికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఒటిపి వస్తుందని, ఆ సంఖ్యను సబ్మిట్ చేస్తే ఓకే అవుతుందని తెలిపారు. సమీపంలోని సచివాలయాలకు వెళ్లి అర్హత ఉన్న వారంతా నమోదు చేసుకోవాలని కోరారు. ఇల్లు నిర్మించుకోవడానికి సైట్ ఓపెన్ అయిందన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్‌తో సమావేశం నిర్వహించారు. ఇంటి పట్టాలు, పొజిషన్ పట్టాలపై వచ్చే సమస్యలపై చర్చించారు. సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు భారతి, లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీసుయతీంద్ర తీర్థ అవార్డులు ప్రదానం

ప్రజాశక్తి - మంత్రాలయం



అవార్డులు అందజేస్తున్న పీఠాధిపతులు

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీసుయతీంద్ర తీర్థుల పేరుతో శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు అవార్డులు ప్రదానం చేశారు. గురువారం స్థానిక శ్రీమఠంలో జరిగిన శ్రీసుయతీంద్ర తీర్థుల ఉత్తరారాధన సందర్భంగా ఆయన బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. సామాజిక సేవలో పాలుపంచుకున్న మహిళలకు అవార్డులను ప్రదానం చేశారు. శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో నర్సులుగా విధులు నిర్వహిస్తున్న సరళ, ఈరమ్మ, రాధకు పీఠాధిపతులు జ్ఞాపికలను అందజేశారు. శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాల వైద్యులు డాక్టర్ సుధీంద్ర, సూపరింటెండెంట్ విజయీంద్ర రావు, ఫార్మాసిస్టు ప్రదీప్‌లు నర్సులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో
22న జాబ్ మేళా

ప్రజాశక్తి- ఆలూరు



మాట్లాడుతున్న ఆనంద్ రాజ్ కుమార్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఈ జాబ్ మేళాలో వైఎస్‌కె ఇన్ఫోటెక్ ప్రయివేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, యంగ్ ఇండియా కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదివి, 18-35 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని చెప్పారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని కోరారు. ఇతర వివరాల కోసం 9010003132 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఎమ్మెల్యే బీవీ ఆదేశాలతో
ఈద్గాలో పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈద్గాలో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయని టిడిపి మైనారిటీ నాయకులు హుసేన్ పీరా, బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, షాబీర్, సలీమ్ తెలిపారు. గురువారం వారు ఈద్గాలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రంజాన్ సందర్భంగా ఈద్ నమాజ్‌కు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న మైనార్టీ టిడిపి నాయకులు

మౌలిక సదుపాయాలు కల్పించండి

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం పుణ్యక్షేత్రంలో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామి వారి దర్శనం కోసం వేల సంఖ్యలో భక్తులు వస్తారన్నారు. భక్తుల ద్వారా దేవాలయానికి రూ.కోట్ల ఆదాయం వస్తున్నా సదుపాయాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయని తెలిపారు. భక్తులకు తాగునీరు, మహిళలకు మురుగుదొడ్ల సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇంత పెద్ద దేవస్థానంలో డ్రెయినేజీ వ్యవస్థ కూడా సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు ఎక్కడంటే అక్కడ నిలుస్తున్నాయని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని చెప్పారు. శాశ్వత నీటి పథకం, మాస్టర్ ప్లాన్‌తో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మురుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. వేసవి దృష్ట్యా భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను దేవాలయ కార్య నిర్వహణ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భక్తుల మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలో పనులు చేపట్టి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని అధికారులు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి ఈరన్న, గిరప్ప, నరసప్ప, హనుమంతు, వీరేష్, వన్నూరు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

నేటి నుంచి భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఉగాది పండగ సందర్భంగా శ్రీశైలం శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి వారి దర్శనం కోసం ఆదోని మీదుగా వెళ్లే పాదయాత్ర భక్తులకు ఈనెల 21 నుంచి 24 వరకు ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులోని శ్రీసరస్వతి దేవి దేవాలయం ఆవరణంలో అన్నదానం ప్రారంభిస్తున్నట్లు అల్కూరి మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. దాతల సహకారంతో ప్రతేడాది శివరాత్రి, ఉగాది పాదయాత్ర వెళ్లే భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. శ్రీమహాయోగి లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం సందర్భంగా కూడా అన్నదానం కొనసాగిస్తున్నామని తెలిపారు. దాతల సహకారం, మహర్షి మఠం కుటుంబం పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ : పెద్దహరివాణం గ్రామంలో శివసాయి గణేష్ దేవాలయం ఆవరణంలో హాల్వి చిన్నరమేష్, ఉనే గర్జప్ప, బండి తిమ్మప్ప, మరిస్వామి ఆధ్వర్యంలో భక్తులకు నీళ్ల ప్యాకెట్, మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ముగిసిన గద్దెరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని గద్దెరాళ్ల మారెమ్మ దేవర ఉత్సవాలు మంగళవారం ప్రారంభమై గురువారంతో ముగిశాయి. భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలు, హుండీ రూపంలో వచ్చిన ఆదాయాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి వీరయ్య, గ్రామ పెద్దలు సూరన్న, రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. మూడు రోజులపాటు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం రూ.3,85,144 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది హుండీ ఆదాయం తగ్గిందని తెలిపారు.



వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నాటు సారా నిర్మూలనకు సహకరించండి

- ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ సైదుల్



కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పరిసర ప్రాంతాల్లో నాటు సారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిఐ సైదుల్ కోరారు. గురువారం స్థానిక స్టేషన్‌లో బెల్లం వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటుసారా తయారీలో బెల్లం వాడుతున్నారని, విచ్చలవిడిగా బెల్లం విక్రయించడం వల్ల నాటుసారా స్థావరాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. బెల్లం కొనే వారి ఆధార్ కార్డు సేకరించి 5 కిలోలకు మించి ఇవ్వరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

- ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - హాలహర్వి

తాము ఎదుర్కొంటున్న సమస్యలు, పని ఒత్తిడి తగ్గించాలంటూ పంచాయతీ కార్యదర్శులు కోరారు. గురువారం హాలహర్వి ఎంపిడిఒ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... పంచాయతీ స్థాయిలో వ్యవహారాలను చూసుకుంటూనే, సచివాలయాల సిబ్బంది చేయాల్సిన పనులను కూడా ఒకే సమయంలో పర్యవేక్షణ చేయాల్సి రావడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఇన్‌ఛార్జ్ ఇఒఆర్‌డి శ్రీనివాసులు, ఈరన్న, శ్రీనివాసులు, నిరంజన్, మంజు పాల్గొన్నారు.

హంతకుల దుస్తులు స్వాధీనం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రం కల్బుర్గి (గుల్బర్గా)లో జరిగిన హత్య కేసులో హంతకులు ధరించిన దుస్తులను కర్ణాటక కల్బుర్గి సిఐ సుశీల్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. గురువారం సిబ్బందితో హంతకులతో కలిసి మంత్రాలయం చేరుకున్న వారు స్థానిక ఎస్ఐ శివాంజుల్ అనుమతితో శ్రీశాంతిధామ వృద్ధాశ్రమం సమీపంలో మాధవరం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మోరీ సమీపంలో దుస్తులను పడేసిన నేపథ్యంలో వాటిని పరిశీలించి భద్రంగా స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 16న రాత్రి సమయంలో ముగ్గురు వ్యక్తులు కలిసి మద్యం సేవించి రేవణసిద్ధప్ప (33)ను హత్య చేసి మంత్రాలయం వచ్చారని, స్థానిక ప్రయివేట్ లాడ్జీలో స్నానానికి గదిని తీసుకున్నట్లు విచారణలో తేలిందని సిఐ సుశీల్ కుమార్ తెలిపారు. ఎఎస్ఐ హనుమంతు ఉన్నారు.



మాట్లాడుతున్న పోలీసులు

22న మార్కెట్‌కు వేలం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ సుంకం వసూలుకు ఈనెల 22న వేలం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ఆదోని పురపాలక సంఘానికి చెందిన ఝాన్సీలక్ష్మిబాయి కూరగాయల మార్కెట్‌కు సంబంధించి 2025-26 సంవత్సరానికి (ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 వరకు) సుంకం వసూలు చేసుకోవడానికి కాంట్రాక్టర్‌కు హక్కు ఉంటుందన్నారు. ఈనెల 22న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనాలని కోరారు.

'పోలింగ్ కేంద్రాలు, ఓటరు నమోదుపై సమావేశం'

ప్రజాశక్తి - మంత్రాలయం

పోలింగ్ కేంద్రాల ఆధునీకరణ, కొత్త పోలింగ్ కేంద్రాలు, ఓటరు నమోదు చేసే అంశంపై రాజకీయ పార్టీల నాయకులు, ఓటరు నమోదు అధికారులతో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తహశీల్దార్ ఎస్.రవి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంత్రాలయం-145 అసెంబ్లీ నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ నాయకులకు, ఓటరు నమోదు అధికారులతో ఈనెల 21న ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.అనురాధ పాల్గొంటారని తెలిపారు. పార్టీల నాయకులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

డబ్బు కోసమే అవిశ్వాసం..!

- మున్సిపల్ ఛైర్మన్ శాంత
- జిల్లా వైసిపి అధ్యక్షునిపై ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

డబ్బు కోసమే తనపై అవిశ్వాసం పెడుతున్నారని మున్సిపల్ ఛైర్మన్ శాంత మండిపడ్డారు. గురువారం పట్టణంలోని కోట్ల విగ్రహం వద్ద నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఏ తప్పు చేయకున్నా అవిశ్వాస తీర్మానం పెట్టాలని కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం తగదన్నారు. నాలుగేళ్ల పాటు నిజాయితీగా ఉంటూ వైసిపిలోనే కొనసాగుతున్నానని తెలిపారు. ఆ పార్టీ కౌన్సిలర్లే తనను పదవి నుంచి దింపాలని చూడటం సమంజసం కాదని చెప్పారు. న్యాయం చేయాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరతామని తెలిపారు. పార్టీ కండువా మారకుండా ఉన్న తనను కనీసం ఒక్క మాట కూడా అడగకుండానే మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి కలెక్టర్ వద్దకు ఎలా వెళ్తారని నిలదీశారు. బాధ్యతాయుతమైన పదవిలో కొనసాగుతున్న వైసిపి జిల్లా అధ్యక్షునికి ఇంగిత జ్ఞానం కూడా లేదని మండిపడ్డారు. పార్టీ కోసం పాటుపడుతూ తన భర్త సింహం నాగేంద్ర మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి విధేయునిగానే కొనసాగారని చెప్పారు. ఏ కారణమూ లేకుండా ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలని పట్టుబట్టడంతోనే విభేదించి తన భర్త సింహం నాగేంద్ర బిజెపిలో చేరారని తెలిపారు. పార్టీకి ఎలాంటి నష్టమూ కలిగించలేదన్నారు. అప్పట్లో తమ విధేయతను, పార్టీకి అందించిన సేవలను గుర్తించి వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ ఛైర్మన్‌గా షీల్డ్ కవర్‌లో పేరు ప్రతిపాదన చేశారని చెప్పారు. ఇందులో సాయి ప్రసాద్ రెడ్డి ప్రమేయం ఏమీ లేదన్నారు. అప్పట్లోనే సిహెచ్.లోకేశ్వరిని ఛైర్మన్‌ను చేయాలని కొంత నగదు కౌన్సిలర్లకు ముట్టిందన్న విషయం తెలిసిందేనని తెలిపారు. రెండున్నర ఏళ్ల చొప్పున ఛైర్మన్‌గా కొనసాగాలని అప్పట్లో తీర్మానం చేశామని ఇప్పుడు పేర్కొనడం సాయి ప్రసాద్ రెడ్డికి తగదని విమర్శించారు. పని చేయకుండా బిల్లుల మంజూరుకు ఎలా ఒప్పుకునేది అంటూ ప్రశ్నించారు. 'వారి మాట వింటే సరి. లేదంటే ఇలా క్షోభకు గురి చేయడం సబబు కాద'ంటూ మండిపడ్డారు. మాట వరసకు కూడా సంప్రదించకుండా జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి అవిశ్వాసం తీర్మానం కోసం కలెక్టర్‌ను ఎలా కలుస్తారని నిలదీశారు. తనకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూనే పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి తెలిసేలా చేస్తామన్నారు. అడిగిన డబ్బు తమతో లేదని ఛైర్మన్‌గా నాలుగేళ్లు కొనసాగుతున్నా ఎలాంటి అక్రమాలకు పాల్పడ లేదని తెలిపారు. అవిశ్వాస తీర్మానం మద్దతు తెలిపితే ఒక్కో కౌన్సిలర్‌కు రూ.1.50 లక్షలు ఇచ్చారని చెప్పారు. ఆ డబ్బు తీసుకున్న వారే కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారని పేర్కొన్నారు. అవిశ్వాస తీర్మానం పెట్టి పదవి నుంచి దించాలని గట్టి నిర్ణయం తీసుకున్న వారిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు కీలక పాత్ర పోషించారని మండిపడ్డారు. ఆయనకు ప్రత్యేకంగా రూ.5 లక్షలు ఇచ్చినట్లు తెలిసిందన్నారు. ఆ డబ్బు కోసమే అవిశ్వాస తీర్మానం తెరమీదకు తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న న్యాయం చేసే వరకు ఆందోళన చేస్తానని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ శాంత

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

- ప్రిన్సిపల్ శైలజ

ప్రజాశక్తి - నందవరం

నందవరం కెజిబివిలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. కెజిబివిలో 6, 10, 11, 12వ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. 6వ తరగతికి 40 సీట్లు, 10వ తరగతికి 3, ఇంటర్ ఫస్ట్ ఇయర్ 40, సెకండ్ ఇంటర్‌కు 21 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఎంపికయిన విద్యార్థుల జాబితా ఏప్రిల్ 21న విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఎంపికయిన విద్యార్థినులకు కాల్స్, మెసేజ్ ద్వారా సమాచారాన్ని అందిస్తామని తెలిపారు.

బదినేహాళ్‌లో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బదినేహాళ్ గ్రామంలో శ్రీమల్లికార్జున స్వామి రథోత్సవం సందర్భంగా విరుపాక్షి రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు వాహిద్ బాష, చైతన్య, మల్లి తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఆసక్తి గల జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి బహుమతి రూ.30 వేలను బి.విరుపాక్షి రెడ్డి, ద్వితీయ బహుమతి రూ.20 వేలను శివారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత నరేష్ రెడ్డి, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' బహుమతిని విశ్వనాథ్ రెడ్డి అందజేస్తారన్నారు. ఈనెల 23 నుంచి టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, ప్రవేశ రుసుం చెల్లించి జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

సమయానికి విద్యార్థి బస్సు నడపాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో విద్యార్థి బస్సును సరైన సమయానికి నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, మండల నాయకులు పవన్ తేజ, రంగస్వామి కోరారు. గురువారం వారు మాట్లాడారు. విద్యార్థి బస్సు సరైన సమయంలో రాకపోవడం వల్ల పరీక్షల సమయంలో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్ల మీదుగా అల్వాల గ్రామం వరకు బస్సు నడపాలని కోరారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

- ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు

ప్రజాశక్తి - ఆస్పరి

అంగన్వాడీలు పిల్లలకు మంచి పోషకాహారం అందించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శివలింగమ్మ, పద్మావతి తెలిపారు. గురువారం సిడిపిఒ మద్దమ్మ ఆదేశాల మేరకు ఆస్పరి ఎంపిడిఒ కార్యాలయంలో పోషణ్ బి, పడాయ్ బి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 0, 3 ఏళ్ల పిల్లలకు నవ చేతన, 3, 6 ఏళ్ల పిల్లలకు ఆధార్ శిలా, పిల్లలకు నాణ్యమైన భోజనంతో పాటు బాల్య అభివృద్ధి, సంరక్షణ, విద్యపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.



ఆస్పరిలో అంగన్వాడీలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు

శనివారం వరకు అంగన్వాడీలకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. **దేవనకొండ** మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో అంగన్వాడీలకు ప్రత్యేక శిక్షణా తరగతులు సిడిపిఒ మద్దమ్మ ప్రారంభించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు షాహిదా, సునీత మాట్లాడారు.



దేవనకొండలో



'పాఠశాలను యథావిధిగా కొనసాగించాలి'

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

తమ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో యథావిధిగా కొనసాగించాలని మండలంలోని వెంకటగిరి గ్రామస్తులు కోరారు. గురువారం ఎంఇఒ వసంత బాయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాదాపు 35 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ప్రాథమిక పాఠశాలను వేరే కాలనీలోని పాఠశాలలో విలీనం చేయడం ఏమిటని ప్రశ్నించారు. వేరే పాఠశాలలో విలీనం చేస్తే చిన్నపిల్లలు నడిచి వెళ్లడానికి భారంగా ఉంటుందని తెలిపారు. పాఠశాలను తమ కాలనీలోనే ఉండాలని డిమాండ్ చేశారు. అవసరమైతే విద్యార్థి సంఘాలను కలుపుకొని ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పాఠశాల ఛైర్మన్ ప్రసాద్, గిడ్డయ్య, దేవరాజు, పౌలు, జయరాముడు, ఎస్.దుబ్బన్న, రంగన్న పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా మహేంద్ర

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా మహేంద్ర నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. నిరుద్యోగులకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. ఇప్పుడు మరోసారి రాష్ట్రంలో యువకుల ఓట్లను పొంది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని బాష పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలి

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ కోరారు. గురువారం నియోజకవర్గ ఉపాధ్యక్షులు గర్జి హనుమంతప్ప మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో జయంతి వేడుకల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 14న మంత్రాలయంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం పక్కన సభను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్న ట్లు చెప్పారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మాదిగ రత్నం, మండల అధ్యక్షులు గాడిమోడు నరసింహులు మాదిగ, చెట్నీహళ్లి నాయకులు నరసింహులు, ఏసు, టి.రవి, దానియేలు, దేవ రాజు, లాజరు, ప్రసాద్, ఖాసీం, ఈరన్న, బాబు, జయరాజు, రాజు, బాబురావు, పెద్ద భీమయ్య, ప్రభుదాసు, ఎర్రయ్య, భాస్కర్, శివయ్య, రామా రావు, నరసింహులు, అబ్రహం, టి.రమేష్ పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంకు వద్ద మంటలు

- తప్పిన అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని స్టేట్ బ్యాంకు వద్ద గురువారం సాయంత్రం జనరేటర్ రూము సమీపంలో మంటలు చెలరేగాయి. గమనించిన బ్యాంకు సిబ్బంది ఎమర్జెన్సీ అలారం మోగించారు. స్థానికులు వెంటనే స్పందించి మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం తప్పడంతో బ్యాంకు అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు.

డెంగీ అనుమానాస్పద కేసు నమోదు


ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని సంఘాల గ్రామంలో హెచ్.సుధాకర్ కుమారుడు యశ్వంత్‌కు తీవ్ర జ్వరంతో ఆస్పత్రికి వెళ్లగా డెంగీ అనుమానాస్పద కేసు నమోదు చేశారు. గురువారం కోడుమూరు నియోజకవర్గం పరిధి మలేరియా వైద్యులు రంగస్వామి ఆ గ్రామానికి చేరుకొని పరిసరాలను, వీధులను పరిశీలించి పారిశుధ్య చర్యలు చేపట్టారు. మురుగునీరు తొలగించి, చెత్తాచెదారం వంటివి ఎత్తివేయించి బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లించారు. చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులను అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కలుషిత నీరు, పరిసరాల అపరిశుభ్రత వల్ల వచ్చే రోగాలపై అవగాహన కల్పించారు.

'బార్' నామినేషన్ల ప్రక్రియ ముగింపు

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు బార్ అసోసియేషన్ 2025-26 ఎన్నికల్లో గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేష్ నాయుడు తెలిపారు. వచ్చిన నామినేషన్లలో అధ్యక్ష పదవికి 2, ఉపాధ్యక్షునికి 1, కార్యదర్శికి 2, ట్రెజరీకి 1 నామినేషన్ వేసినట్లు తెలిపారు. నేడు స్క్రూట్నీ, 23న విత్ డ్రా, 27న ఓటింగ్ ఉంటుందని, అదే రోజు సాయంత్రం కౌంటింగ్ చేసి గెలిచిన వారి పేర్లను ప్రకటిస్తామని తెలిపారు.



నామినేషన్లను స్వీకరిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

బాధిత రైతులను ఆదుకోవాలి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ


ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు పారిశ్రామిక వాడకు నీటిని సరఫరా చేసేందుకు ముచ్చుమర్రి నుంచి చేపట్టిన పైపులైన్ పనుల ద్వారా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లు ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పైపులైన్ నిర్మాణం కోసం రైతుల పంట పొలాల్లో పెద్ద గుంతలు తవ్వారని, వారికి ఎలాంటి నష్ట పరిహారమూ ఇవ్వలేదని తెలిపారు. ఈనెల 22న ఓర్వకల్లు పర్యటనకు వస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే వారి పంట పొలాల్లో పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసేలా ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారని, రైతులకు తగిన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఓర్వకల్లు మండలంలో రిజర్వాయర్‌ను నిర్మించి ఇక్కడ గ్రామాల్లో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, రైతుసంఘం నాయకులు చంద్రబాబు, మధు, కేతవరం గ్రామ శాఖ కార్యదర్శి జి.శ్రీధర్, రైతులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, సూర్యనారాయణ పాల్గొన్నారు

'కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి'

ప్రజాశక్తి - సి బెళగల్

కాటి కాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం బెళగల్‌లోని ఎన్‌టిఆర్ పార్కులో మండలంలోని కాటికాపరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నేటికీ శ్మశానంలో గుంతలు తవ్వడం, మృతదేహాలను ఖననం చేయడం వంటి వృత్తి ఆధారంగా అనేక కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. అంతిమ సంస్కారంలో వ్యాధులు అంటి పెట్టుకొని అనారోగ్యం పాలవుతున్నా ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని వాపోయారు. ఉచిత ఆరోగ్య బీమా వర్తింపచేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు